మనోవేదన

- మూత్రశాలలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న మహిళలు
- పట్టణానికి వచ్చే గ్రామీణ ప్రజలకు తప్పని ఇక్కట్లు
- పాతబజార్‌లో పరిస్థితి ఘోరం

అచ్చంపేట రూరల్: పట్టణంలో పబ్లిక్ టాయిలెట్లు లేక గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అచ్చంపేట మేజర్ గ్రామపంచాయతీ, నగర పంచాయతీ, మున్సిపల్‌గా అప్‌గ్రేడ్ అయినా.. పబ్లిక్ టాయిలెట్లపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిసారించడంలేదు. దీంతో పట్టణానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా మహిళలు మనోవేదనకు గురవుతున్నారు. ప్రధానంగా పట్టణంలోని పాతబజార్‌లో నిత్యం రద్దీగా ఉంటుంది.

పాతబజార్‌లో పరిస్థితి ఘోరం..

అచ్చంపేట డివిజన్ కేంద్రం కావడంతో వివిధ గ్రామాల నుంచి ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, మహిళలు అచ్చంపేటకు రాకపోకలు సాగిస్తుంటారు. పట్టణంలోని నెహ్రూ చౌరస్తాలో వ్యాపార సముదాయాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ ప్రదేశంలో పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఉప్పునుంతల, లింగాల రోడ్డు, ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో పెయిడ్ టాయిలెట్లు ఉన్నాయి. పురపాలిక తరఫున ఎలాంటి పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయలేదు. రెండేళ్ల కిందట అదనపు కలెక్టర్ మనూ చౌదరి పబ్లిక్ టాయిలెట్ల ఏర్పాటు స్థలాలను పట్టణంలో పరిశీలించారు. మల్లంకుంట ఎదురుగా, పాతబజార్‌లోని లేఖ లాడ్జి పక్కన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్థలాలను కూడా పరిశీలించారు. మున్సిపల్ అధికారులు పనులే ప్రారంభించలేదు.

పెట్రోల్ బంకుల్లో కానరాని టాయిలెట్లు...

పెట్రోల్ బంకుల్లో ఉండే టాయిలెట్లను ప్రజలు వినియోగించుకోవాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా.. ప్రజలకు తెలియకపోవడంతో వినియోగించుకోవడం లేదు. పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపుల నాలుగు పెట్రోల్ బంకులు ఉన్నా.. వాటిలో టాయిలెట్లు కన్పించడం లేదు. దీంతో స్వచ్ఛభారత్ పట్టణంలో కన్పించడం లేదు.



అచ్చంపేటలోని పాతబజార్

ఏర్పాటు చేయాలి...



అచ్చంపేట పట్టణం దినదినాభివృద్ధి జరుగుతుంది. ఎన్నో ఏళ్లుగా పాతబజార్‌లో మూత్రశాలలు ఏర్పాటు చేయాలని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. వివిధ ప్రాంతాల నుంచి మహిళలు, ప్రజలు అచ్చంపేటకు ఎక్కువగా వస్తుంటారు. త్వరగా మూత్రశాలలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి.

– బాలాజీ, అచ్చంపేట

త్వరలో ఏర్పాటు...



జనాభా ప్రాతిపదికన పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేస్తున్నాం. పట్టణంలోని పాతబజార్ లేఖ లాడ్జి సమీపంలో త్వరలోనే పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే ఆయా చోట్ల పెయిడ్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు. అవసరం ఉన్న చోట పబ్లిక్ టాయిలెట్లను నిర్మిస్తాం. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం

– శ్రీహరిరాజు, మున్సిపల్ కమిషనర్, అచ్చంపేట

క్లుప్తంగా

ముమ్మరంగా వరి కోతలు



తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సాగుచేసిన వరిపంట చేతికి రావడంతో వరి కోతలు ముమ్మరం చేశారు. కూలీల కొరత కారణంగా రైతులు యంత్రాల కోసం వేచి చూడాల్సి వస్తుంది. కూలీలు లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో యంత్రాలను ఆశ్రయించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో యంత్రాలకు కూడా విపరీతంగా ధరలు పెరిగాయి.

పారిశుద్ధ్య కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోండి

కోడేరు: మండలంలోని తీగలపల్లికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు రాములు(48) గుండెపోటుతో శనివారం ఉదయం మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పారిశుద్ధ్య కార్మికుల యూనియన్ మండల అధ్యక్షుడు రాములు, సాయిబాబు తెలిపారు. మృతునికి భార్య చంద్రకళ, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పరిమితికి మించి ప్రయాణం



బల్మూర్: వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా ఆటోల్లో కేవలం నాలుగు సీట్ల కెపాసిటీ మాత్రమే ఉండగా.. డ్రైవర్లు 20 మంది వరకు కిక్కిరిసి ఎక్కించుకొని ప్రమాదభరితమై ప్రయాణం చేసూ.. ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మండలంలోని బల్మూర్, కొండనాగుల, తుమ్మెన్‌పేట, బాణాల, గట్టుతుమ్మెన్ తదితర గ్రామాల నుంచి ఆటోలు, జీపుల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారి ప్రమాదభరితం



బల్మూర్: మండలంలోని తుమ్మెన్‌పేట స్టేజీ వద్ద బీటీ రోడ్డు గుంతగా మారి ప్రమాదకరంగా తయారైంది. అధికారులు అటుగా తిరుగుతున్నా.. రహదారి మరమ్మతు చేయించాలనే ఆలోచన లేకుండా పోయిందని వాహనదారులు విమర్శిస్తున్నారు. నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారిని అనుసరించి తుమ్మెన్‌పేటకు వెళ్లే ఈ దారి ప్రారంభంలోనే రెండు నెలల కిందట బీటీ కుంగిపోయింది. దీంతో ఇక్కడ పెద్ద గుంత ఏర్పడి వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. రాత్రివేళ ద్విచక్ర వాహనదారులైతే గుంత కనిపించకపోవడంతో కింద పడి గాయాలపాలవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఈ గోతిలో బీటీతో మరమ్మతు చేసినా ఫలితం ఉండదని, సీసీ వేయాలని వాహనదారులు కోరుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే బీటీపై ఏర్పడిన గుంతను మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

వృథాగా ప్రభుత్వ భవనాలు



మన్ననూర్: స్థానికంగా నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలు స్థిర ఆస్తులను ఉపయోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో కొంత కాలంగా అనేక నిర్మాణాలు చేసినప్పటికీ ప్రస్తుతం ఆ భవనాలు ఎందుకు అవసరానికి రాకుండా దిక్కుతోచని స్థితిలో ఉన్నాయని వాపోతున్నారు. ముఖ్యంగా పీహెచ్‌సీ ఆవరణలో డయాగ్నస్టిక్ సెంటర్ పేరుతో సుమారు రూ.కోటి వ్యయం చేసి భవనం నిర్మించారు. నాలుగు నెలల కిందట ఆర్థిక, వైద్యఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావ్ ఆ భవనాన్ని ప్రారంభించినప్పటికీ అక్కడ ఎలాంటి సేవలు ఇప్పటి వరకు అందుబాటులోకి రాలేదు. సంబంధిత అధికారులు తమ ఆధీనంలోకి తీసుకుని ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అధికారులు, పాలకులు కాంట్రాక్టుల కోసం భవనాలు మంజూరు చేస్తున్నారు తప్పా.. ఆ భవనాలు ఎందుకు ఉపయోగించుకోకపోవడం విచారకరమని వాపోతున్నారు. ఇప్పటికైనా శిథిలావస్థలోకి చేరుకుంటున్న భవనాలను పరిశీలించి ఆదివాసీలు, దళితులు అధికంగా ఉన్న ఈ నల్లమల ప్రాంత ప్రజలకు ఆరోగ్యపరమైన వసతులు ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నాం.

శారీరక ఆరోగ్యం, పరిశుభ్రత కలిగి ఉండాలి

కల్వకుర్తి రూరల్: విద్యార్థులు శారీరక ఆరోగ్యంతో పాటు పరిశుభ్రత కలిగి ఉండాలని సత్యసాయి సేవా సమితి మహిళా విభాగం సభ్యులు అనిత, మాధురి అన్నారు. శనివారం పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో మానవతా విలువలతో కూడిన విద్య అనే విషయంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం సత్యసాయి సేవా సంస్థలను విద్యాశాఖ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసిందన్నారు. ఈ సందర్భంగా వారు శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, సామాజిక ఆరోగ్యం, భావోద్రేక ఆరోగ్యంపై సమగ్రంగా విద్యార్థులకు వివరించారు. ఆరోగ్యం అనేది అన్నింటికంటే విలువైందన్నారు. 114 మంది బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సత్యసాయి మహిళా విభాగం సభ్యులు

రక్షణ గోడలు లేక ఇబ్బందులు



ఎల్మపల్లి రోడ్డులో రక్షణ గోడలు లేని కల్వర్టు

అమ్రాబాద్: రక్షణ గోడలు లేని కల్వర్టులతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. కల్వర్టుల ప్రదేశంలో ఏమరుపాటుకు గురైతే వాహనాలు అందులో పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. దీంతో అమ్రాబాద్ మండలంలో రహదారులపై నిర్మించిన కల్వర్టులకు రక్షణ గోడలు నిర్మించాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. రహదారులపై కల్వర్టులు నిర్మించిన అధికారులు.. వాటికి రక్షణ గోడలు నిర్మించలేదు. మండల కేంద్రం నుంచి గ్రామాలకు వెళ్లే రహదారులపై వెంకటేశ్వర్లబావి సమీపంలో, తుర్కపల్లి సమీపంలో, జంగంరెడ్డిపల్లి వెళ్లే రోడ్డుకు అమ్రాబాద్ సమీపంలో మందవాగుపై బ్రిడ్జితో పాటు చింతలోనిపల్లి రోడ్డు, ఎల్మపల్లి, తిర్మలాపూర్(బీకే) రోడ్లపై రక్షణ గోడలు లేని కల్వర్టులున్నాయి. వీటితో పాటు మరికొన్ని చోట్ల శిథిలావస్థలో ఉన్న కల్వర్టులు ఉన్నాయి. కల్వర్టుల వద్ద రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి ద్విచక్రవాహనాలు, ఆటోలు, జీపులు కింద పడి ప్రమాదాలు జరిగిన సంఘటనలు చాల ఉన్నాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. గతంలో మన్ననూర్, మద్దిమడుగు ప్రధాన రహదారిపై కల్వర్టుల నిర్మాణం పనులు చేపట్టిన అధికారులు, పంచాయతీ రోడ్లపై ఎందుకు నిర్మించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి కల్వర్టులకు రక్షణ గోడలు నిర్మించాలని, శిథిలమైన రక్షణ గోడలను మరమ్మతు చేయించాలని, అలాగే ఆ ప్రదేశంలో సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


కంకర రోడ్డుతో అవస్థలు



వెల్దండ- చారకొండ రోడ్డులో నగారగడ్డతండా వద్ద రోడ్డుపై కంకర కుప్పలు ఇలా..

వెల్దండ: మండల పరిధిలోని నగారగడ్డతండాకు కంకర తేలిన రోడ్డుతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వెల్దండ- చారకొండ ప్రధాన రహదారిపై బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టి దాదాపుగా రెండేళ్లు గడుస్తున్నా.. నేటికి రోడ్డు పనులు పూర్తి చేయలేదు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా చేసి వదిలేశారు. రోడ్డులో పెద్దగా కంకర కుప్పలు వేయడంతో రాత్రి వేళలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఉన్నత అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేసి బీటీరోడ్డు వేసి వాహనదారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

వాగులపై వంతెనలు ఏవీ?



లింగాల నుంచి పద్మన్నపల్లి వెళ్లే మార్గంలో వంతెన లేని వాగు

లింగాల: మండలంలోని పలు మార్గాల్లోని వాగులపై వంతెనలు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన మార్గాల్లోనే గాక బైపాస్ మార్గాల్లో ఉన్న పలు వాగులు వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తే రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లింగాల నుంచి పద్మన్నపల్లి బైపాస్ మార్గంలో రెండు వాగులు, అవుసలికుంట నుంచి శాయిన్‌పేట మార్గంలో, అంబట్‌పల్లి నుంచి రాయవరం వెళ్లే మార్గంలో, చెన్నంపల్లి ద్వారా పద్మన్నపల్లి మధ్యలో ఉన్న వాగులపై వంతెనలు నిర్మించాలని పలు మార్లు ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పలు మార్గాల్లో లో కల్వర్టులు కూడా సమస్యగా మారుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వాగులపై వంతెనలు నిర్మించేందుకు తగు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపి నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూర్‌లో అనారోగ్యంతో మృతిచెందిన ఉప్పరి లక్ష్మయ్య కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పరామర్శించారు. కుటుంబ స్థితిగతులను తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

రెండు బైక్‌లు ఢీ : ముగ్గురికి గాయాలు

ఉప్పునుంతల: మండలంలోని తిప్పాపూర్ సమీపంలోని చౌరస్తా వద్ద శనివారం సాయంత్రం ఎదురెదురుగా వెళ్తున్న రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. తాడూరుకు చెందిన జానయ్య తన బైక్‌పై తిప్పాపూర్ నుంచి తాడూరు వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో కల్వకుర్తికి చెందిన భార్యాభర్తలు నర్సయ్య, వెంకటమ్మలు బైక్‌పై అచ్చంపేట నుంచి కల్వకుర్తి వైపు వెళ్తుండగా.. చౌరస్తా వద్ద ప్రమాదవశాత్తు రెండు బైక్‌లు ఢీకొన్నాయి. దాంతో వారి కాళ్లకు, చేతులకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్‌లో వారిని అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు.

సారా, నల్లబెల్లం పట్టివేత



బల్మూర్: మండలంలోని గోదల్ గ్రామ సమీపంలో శనివారం రాత్రి ఎక్సైజ్ పోలీసులు ముందస్తు సమాచారం మేరకు ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న సారా, నల్లబెల్లంను పట్టుకున్నారు. మండలంలోని నర్సాయపల్లికి చెందిన రవి స్కూటర్‌పై 24 లీటర్ల సారాతో పాటు 50 కిలోల నిషేధిత నల్లబెల్లం తరలిస్తూ.. పట్టుబడినట్లు ఎస్‌ఐలు బాల్‌రాజ్, సతీష్‌కుమార్ తెలియజేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయడంతో పాటు స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ప్రమాదభరితంగా మలుపులు



ఉప్పునుంతల: ఉప్పునుంతల- అచ్చంపేట ప్రధాన రహదారి మలుపులు పూర్తిగా ప్రమాదభరితంగా మారాయి. రోడ్డుకు ఇరువైపుల చెట్లు, గడ్డి కమ్ముకోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు ఏమాత్రం కన్పించకపోవడంతో ప్రమాదాలు త్రుటిలో తప్పిపోతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా రోడ్డుకు ఇరువైపుల శుభ్రం చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. రోడ్డు విస్తరణ సమయంలో రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలను మార్పు చేయకుండా అలాగే వదిలేశారు. నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రోడ్డుపై ప్రయాణం చేస్తున్నా.. పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపుల శుభ్రం చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

సేంద్రియ వ్యవసాయంతో లాభాలు

తాడూరు: సేంద్రియ వ్యవసాయంతో పంటలు సాగుచేయడంతో ఎన్నో లాభాలు ఉన్నాయని, వ్యవసాయ అధికారులు ఇచ్చిన సూచనలు, సలహాలు పాటించడంతో పాటు రసాయన ఎరువులు తగ్గించి, మండల కేంద్రంలో రైతు రమేష్ మిరప సాగు చేపట్టాడు. గతంలో ఐకేపీ ఆధ్వర్యంలో తాను సేంద్రియ వ్యవసాయంపై ఎన్‌పీఎంసీఏగా పనిచేశానని, ప్రస్తుతం స్వయంగా 2 ఎకరాల మిర్చి పంటను సాగు చేశానన్నారు. సేంద్రియం ద్వార సాగు చేయడంతో ఇందుకు సంబంధించిన సంస్థ ఇచ్చిన సూచనలు, సలహాలతో పంట ఆశాజనకంగా ఉందని రైతు తెలియజేశాడు.



మిరప పంట సాగు చేస్తున్న రైతు

డబుల్ బెడ్రూం పునాదులకే పరిమితం



పునాదులకే పరిమితమైన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం

తాడూరు: మండల కేంద్రంలో ఏడాది కిందట నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం పునాదులకే పరిమితమయ్యాయి. గ్రామానికి 3 కిలోమీటర్ల దూరాన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం హుటాహుటిన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఏడాదిలోగా ఇళ్ల నిర్మాణం చేపట్టి లబ్ధిదారులకు ఇళ్లను అందజేస్తామని, అప్పట్లో అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. నిధుల కొరత కారణంగా నిర్మాణ పనులు ఆగిపోయినట్లు కాంట్రాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిరుపయోగంగా రైతు వేదిక

తాడూరు: వ్యవసాయ పరంగా రైతులకు ఆధునికమైన సూచనలు, సలహాలు అందించి రైతులకు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండేందుకు రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రైతువేదికలు నిర్వహణ లేక నిరుపయోగంగా మారుతున్నాయి. మండలంలోని 24 గ్రామపంచాయతీలకు గాను 8 క్లస్టర్లుగా విభజించి రైతు వేదికలను నిర్మించారు. మండల కేంద్రానికి దూరంగా రైతువేదికను నిర్మించారు. దీంతో రైతులు అక్కడికి వెళ్లేందుకు మొగ్గు చూపడంలేదు. సిర్సవాడ, ఇంద్రకల్, బలాన్‌పల్లి గ్రామాల్లో నిర్మించిన రైతువేదికలు మినహా మిగతా గ్రామాల్లో నిర్మించిన రైతువేదికలు ఉపయోగం లేకుండాపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పరిశీలించి ఉపయోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



ఉపయోగంలోకి రాని యాదిరెడ్డిపల్లి రైతువేదిక

శిథిలావస్థలో అదనపు గది



పెద్దకొత్తపల్లిలో అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన అదనపు గది

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలకు అదనపు గది నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా.. కాంట్రాక్టర్ అలసత్వంతో అసంపూర్తిగా నిర్మించి వదిలేయడంతో నిర్మాణ దశలోనే శిథిలావస్థకు చేరుకుంది. 2012లో అదనపు గది నిర్మాణం కోసం రూ.2 లక్షలు నిధులు మంజూరు చేయగా.. కాంట్రాక్టర్ గది నిర్మాణాన్ని పూర్తి చేయకుండా గోడల వరకు నిర్మించి వదిలేశాడు. ప్రస్తుతం గది శిథిలావస్థకు చేరుకుంది. మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో గదులు చాలక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి అదనపు గది నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

పంట రక్షణకు చీర కంచె



యాపట్లలో పంటకు చీర కంచె ఏర్పాటు చేస్తున్న రైతు

పెద్దకొత్తపల్లి: రైతులు యాసంగిలో సాగు చేసిన వేరుశనగ, మినుము తదితర పంటలపై అడవి పందులు దాడులు చేయకుండా రైతులు చీరలను కంచెగా ఏర్పాటు చేసుకుని పంటలను కాపాడుకుంటున్నారు. మండలంలో యాసంగి పంటలను 10,236 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశారు. 6,336 ఎకరాల్లో మినుము పంటను సాగు చేశారు. ఈ పంటలను కాపాడుకునేందుకు రైతులు చీర కంచెతో పాటు చుట్టూ వైర్లు చుట్టీ పంటలను కాపాడుకుంటున్నారు. వేరుశనగ పంటలపై ఎక్కువగా అడవి పందులు దాడి చేసి, వాటిని ధ్వంసం చేస్తున్నాయి. దీంతో రైతులు చీర కంచెలతో పాటు మైకులు ఏర్పాటు చేసుకుని శబ్దాలు చేస్తూ.. అడవి పందులు దాడి చేయకుండా పంటలను కాపాడుకుంటున్నారు. అటవీ ప్రాంతాలైన బాచారం, మారెడుదిన్నె, యాపట్ల, చిన్నకొత్తపల్లి తదితర గ్రామాల్లో రైతులు పంటలను కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వంశీకృష్ణకు సన్మానం

మన్ననూర్: సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో అడుగడుగున మీ శ్రమను, మీ ఆశీర్వాదాలు అందించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఓటరు మహాశయులకు, యువతకు చేతులెత్తి మొక్కుతున్నానని కాంగ్రెస్ పార్టీ అచ్చంపేట అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం మన్ననూర్‌లో ఓ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఎన్నికలను ఉద్దేశించి మాట్లాడారు. మూడు నెలలుగా రాత్రింబవళ్లు ఎన్నో వ్యవ ప్రయాసాలకు ఓర్చుకుని ఎమ్మెల్యేగా గెలుపించేందుకు కృషి చేసిన అమ్రాబాద్ మండల ఎంపీపీ, వైస్‌ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు ముఖ్యంగా ఓటర్లకు సర్వదా రుణపడి ఉంటానని అన్నారు. ఇంతగా కష్టపడి నా గెలుపునకు కృషి చేసిన మీకు ఎల్లవేళల అందుబాటులో ఉండి, రుణం తీర్చుకుంటానని అన్నారు. ఈ సందర్భంగా మన్ననూర్‌లో పార్టీ నాయకులు కార్యకర్తలు ఆయన్ను పూల మాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు.



అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ వంశీకృష్ణను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

'ప్రజావ్యతిరేఖ విధానాలకు గుణపాఠం'

కల్వకుర్తిరూరల్: కాంగ్రెస్ పార్టీ కల్వకుర్తితో పాటు రాష్ట్రంలో ఘన విజయం సాధించి తీరుతుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేఖ విధానాలకు ప్రజలు గుణపాఠం చెప్పబోతున్నారని అన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ కుల్లు రాజకీయాలకు ఆదివారం తెరపడబోతుందని అన్నారు. బీఆర్‌ఎస్ అసమర్థ పాలనకు చరమగీతం పాడి, రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి సంక్షేమాన్ని అందించే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టేలా ఓటింగ్ జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీపై నమ్మకముంచి ఆరు గ్యారంటీలకు అండగా ఉండాలనుకున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, రాహుల్, శ్రీధర్ రెడ్డి, జంగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్‌రెడ్డి